క్లుప్తంగా

ట్యాంకు శుభ్రతకు తేనెపట్టు అడ్డంకి



సామర్లకోట కోట్లమ్మ చెరువు వద్ద వాటర్ ట్యాంకుకు పట్టిన తేనెపట్టు

సామర్లకోట: స్థానిక కోట్లమ్మ చెరువు వద్ద వాటర్ ట్యాంకుకు తేనే పట్టు ఉండడంతో ట్యాంకుల శుభ్రత వాయిదా వేశారు. వేట్లపాలెం గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంతో మండలంలోని నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో గణపతినగరంలో రెండు, కోట్లమ్మ చెరువు వద్ద రెండు వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఇప్పటికే గణపతినగరంలోని రెండు వాటర్ ట్యాంకులను శుభ్రం చేసే పనులు పూర్తి చేశారు. కాగా కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకుల శుభ్రతకు ఆ ట్యాంకుకు పట్టిన తేనెపట్టు అడ్డంకిగా మారింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జె రామారావును వివరణ కోరగా తేనెపట్టును తొలగించి గురువారం ట్యాంకును శుభ్రం చేయిస్తామని తెలిపారు.

వర్షంతో ఉపశమనం



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం కాస్తంత సేద తీర్చింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

గ్రంథాలయాలకు దాతల సహకారం అవసరం



గ్రంథాలయాధికారికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రాజేష్ ఖన్నా

పెద్దాపురం: గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని స్థానిక గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త జిగిని రాజేష్ ఖన్నా పోటీ పరీక్షలకు విద్యార్థులకు అవసరమ్యే గ్రూపు 2, రైల్వే, డీఎస్సీ, గ్రూప్ 1 పుస్తకాలను బుధవారం గ్రంథాలయాధికారి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠకుల సౌకర్యార్థం మెటీరియల్ అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుల్లియ్య, రామారావు, కొమ్మన అప్పారావు, అరవింద్, నరేంద్రకుమార్, వానపల్లి సత్యనారాయణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పిఠాపురం: బీసీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయాలని ఏఐఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అన్నారు. గొల్లప్రోలులోని కాలనీలో ఏపీ ఆర్సీఎస్, ఏఐఎఫ్టీయూ ప్రజా సంఘాల నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తున్న సీఎం చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు కృషి చేయాలని, నిత్యావసరాల ధరల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ రంగంలో సంక్షోభం వల్ల గ్రామాల్లో రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ జిల్లా నాయకులు జిల్లా డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలి

కరప: గ్రామాల్లోని పాఠశాలల హెచ్ఎంలు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, సీఆర్పీల సహకారంతో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచి, వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా కృషిచేయాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమై విద్యాప్రవేశం గురించి, అవగాహన కల్పించారు. వచ్చేనెల 25వ తేదీ వరకు విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అమలు చేస్తున్న పథకాలు తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

తల్లీ బిడ్డల క్షేమమే లక్ష్యం

- ఎంసీపీ కార్డుతో ఎంతో మేలు
- పెద్దాపురంలో 1,387 మంది గర్భిణులు..
- 1,552 మంది బాలింతలు



ఎంసీపీ కార్డు



ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జగదంబ

పెద్దాపురం: గర్భధారణ మొదలు ప్రసవం వరకూ మహిళ ఆరోగ్యంపై ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలు దరిచేరకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. దీని కోసం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు నిర్వహిస్తున్నా మాతా శిశు మరణాలు ఆగడం లేదు. ప్రసూతి సమయంలోనూ గర్భిణులు అవగాహన లోపంతో మృతి చెందుతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించి తొలి నుంచి పూర్తి సమాచారం ఒకే చోట అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులు అందజేసింది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్ల వయసు వచ్చే వరకూ ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. తల్లికి, బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేకంగా ఐడి నంబర్లు ఇస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య సేవలు పొందడంతో పాటు వైద్య పరీక్షలు, మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలను ఈ కార్డులో పొందుపరిచారు. తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించడమే ఈ కార్డు లక్ష్యం. కార్డులో ఇచ్చిన సమాచారం ఆధారంగా వైద్య సేవలు పొందడం ద్వారా గర్భిణులతో పాటు బిడ్డ పూర్తి ఆరోగ్యం ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ యోజన, జననీ సురక్ష యోజన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం అందించే తదితర పథకాల వివరాలను కార్డులో పొందుపరిచారు. ఎంసీపీ కార్డులో వైద్య ఆరోగ్య సిబ్బంది అందించాల్సిన సేవల వివరాలు, వివిధ రకాల వ్యాధుల లక్షణాలు వివరించారు. నవజాత శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకు సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. చిన్నారులకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో వాటిని అధిగమించడానికి నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేలా ఈ కార్డులో వివరించారు.

అన్ని సేవలకు ఒకే కార్డు

తొలి కాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యల వివరాలు, బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగించే అంశాలను దీనిలో ముద్రించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార వివరాలు, పిల్లల శారీరక–మానసిక ఎదుగుదలకు సంబంధించిన అంశాలు, ఐరన్, ఫోలిక్ ఆమ్లం ప్రాధాన్యాన్ని కార్డులో పొందుపరిచారు. బిడ్డ పుట్టిన సమయం కార్డులో నమోదు చేస్తే వెంటనే జనన ధ్రువీకరణ పత్రం వైద్యశాలలో అందిస్తారు.

పెద్దాపురంలో పరిస్థితి ఇదీ..

పెద్దాపురం అర్బన్, రూరల్ గ్రామాల్లో 198 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. అయితే 1,387 మంది బాలింతలు, 1,55 మంది గర్భిణులు ఉన్నారని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. వీరందరికీ పెద్దాపురం ఏరియా ఆసుపత్రి, పులిమేరు, కాండ్రకోట (పీహెచ్సీ)ల సిబ్బంది వైద్యం, వైద్య సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

ఎక్కడైనా వైద్య సేవలు



గర్భిణులు తొలిసారి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్ష చేయించుకున్న సమయంలో ఎంసీపీ కార్డులో వివరాలను నమోదు చేసి అందజేస్తారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు పరీక్షలు చేయించుకుంటే గర్భిణుల్లో రక్తహీనత ఉందా... హైరిస్క్ సమస్యలు ఏమైనా ఉన్నాయా... అనే వివరాలు కార్డులో నమోదు చేస్తారు. ఆ కార్డు ఉంటే ఏ ఆసుపత్రులలోనైనా సులువుగా కాన్పు చేయించుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ జగదంబ, గైనకాలజిస్ట్, ఏరియా ఆసుపత్రి, పెద్దాపురం

పనులు త్వరగా పూర్తిచేయాలి



వేట్లపాలెంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్లో జరుగుతున్న పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి–2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్ను ఆయన పరిశీలించారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. హెచ్ఎం పి.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్వచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జనసేన పార్టీ నాయకుడు మురాలశెట్టి సునీల్ అన్నారు. కుతుకుడుమిల్లి గ్రామంలో బుధవారం 10వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల విద్యార్థులలో మొక్కలు నాటించారు.

సమన్వయంతో జాతరను విజయవంతం చేయండి

- ఆర్డీఓ జేఎస్ రామారావు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో మరిడమ్మ తల్లి జాతరను విజయవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక మరిడమ్మ తల్లి కాలక్షేప మండపంలో వచ్చే నెల నాలుగో తేదీ నుంచి జరగనున్న జాతర ఏర్పాట్లపై బుధవారం రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, ఆర్టీసీ, మున్సిపల్, వైద్యశాఖాధికారులతో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్వి రామ్మోహనరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే ఇలువేల్పుగా పేరొందిన అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆయా శాఖల సిబ్బంది తమ తమ విధుల్లో నిమగ్నమై అమ్మవారి జాతర ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆషాఢ మాసంలో నిర్వహించే జాతరలో శానిటేషన్ పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ఆర్డీఓ సమీక్షించారు. ఈఓ రామ్మోహరావు మాట్లాడుతూ నాలుగో తేదీన జాగరణ ఉత్సవం తరువాత ఐదో తేదీ నుంచి ఆగస్టు పదో తేదీ వరకు 37 రోజుల పాటు జాగరణ ఉత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఎస్ఐ వెలుగుల సురేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ దావీదురాజు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ ఉన్నా సేవలు అధ్వానం

- ప్రజాధనం లక్షలు ఖర్చవుతున్నా తాగునీరు, వీధిలైట్లు నిరుపయోగమే
- శివార్లకు నీటి సరఫరాలో విఫలం
- అధికారులపై కౌన్సిలర్ల ధ్వజం



వివిధ సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

గొల్లప్రోలు: పట్టణంలో రూ.కోట్ల విలువైన మంచి నీటి పథకం ఉంది. ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చు చేస్తు తాగునీటి పథకాన్ని నిర్వహిస్తున్నా పట్టణంలో కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని, ఎక్కడా వీధిలైట్లు వెలగడం లేదని కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం నగర పంచాయితీ చైర్పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరచిన 16 అంశాలను చదివి వినిపించగా నాలుగు అంశాలను నిరాకరిస్తూ మిగిగిలిన అంశాలను ఆమోదిస్తు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి మంచినీటి పథకాన్ని నిర్మించినా కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదని, నెలనెలా వాటర్ ట్యాంకర్లకు బిల్లులు చెల్లిస్తున్నా శివారు ప్రాంతాలకు తాగునీరు ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారో చెప్పాలని కమిషనర్ రవికుమార్ కౌన్సిలర్లు నిలదీశారు. దీనిపై ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ జగనన్న కాలనీ, సూరంపేట వంటి ప్రాంతాలకు నిత్యం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. అనంతరం 15వ వార్డు కౌన్సిలర్ అప్పలస్వామి మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు సరిగా పనిచేయడంలేదని, ఐదు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చజరగ్గా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పారిశుధ్య సమస్య పెరుగుతోందని, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాల అధ్వానంగా ఉన్నాయని వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సలువురు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో అతిసార నిరోధక చర్యలు



హుస్సేన్పురం గ్రామంలో సాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులు

- మాంసం, చేపల విక్రయాల నిషేధం
- జొన్నలదొడ్డి చెరువు నీరు తొలగింపునకు ఏర్పాట్లు
- గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు



అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలో అతిసార వ్యాధిని దృష్టిలో ఉంచుకుని మాంసం చేపల విక్రయాలను పూర్తిగా నిషేధించారు. అలాగే మాంసం తినుబండారాలు విక్రయించే హోటళ్లను మూసివేయించామని ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో నైట్ హోటల్గా పేరు పొందిన హోటల్ను మూయించామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని దండోరా వేయించారన్నారు. గ్రామంలో ప్రత్యేక ప్రారిశుధ్య పనులతో పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు సామర్లకోట మున్సిపల్ ఫిల్టర్ బెడ్ నుంచి వేట్లపాలేనికి తాగునీరు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. గ్రామ శివారు ప్రాంతమైన జొన్నదొడ్డిలో అతిసార వెలుగులోకి రావడంతో ఆ ప్రాంతంలో ఉన్న చెరువులో మురుగునీరు తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓపీఆర్డీ చెప్పారు. ఈ చెరువు ప్రైవేటు వ్యక్తులకు చెందినది కావడం వల్ల మూసి వేసే అవకాశం లేదన్నారు. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకరు, ప్రైవేటు ఆస్పత్రిలో మరొకరు అతిసార సోకి చికిత్స పొందుతున్నారని చెప్పారు. గ్రామంలో కొత్తగా కేసులు నమోదు కాలేదని, అతిసార అదుపులో ఉన్నదన్నారు. వేట్లపాలెం గ్రామంలోని డయేరియా కేసులను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు ప్రారంభించారు.

మున్సిపాలిటీ నుంచి తాగునీరు..

మండల పరిధిలో వేట్లపాలెం గ్రామ శివారు జొన్నలదొడ్డి ప్రాంతంలో 36 మంది అతిసార బారిన పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రోగులకు వైద్యం అందించి వారి ఇళ్లకు తరలించారు. అలాగే జొన్నలదొడ్డిలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేసి ఆరబెట్టి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రామారావు పేర్కొన్నారు. అలాగే సామర్లకోట మున్సిపాలిటీకి చెందిన ట్యాంకరు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అతిసారపై అప్రమత్తం : డీఆర్డీఏ పీడీ

సామర్లకోట: అతిసార వ్యాధి వ్యాపిస్తుండడంతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పని చేయాలని డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. బుధవారం స్థానిక టీటీడీసీలో జరిగిన 15వ జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు ప్రజలను చైతన్యపరచాలని ఆమె పేర్కొన్నారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు పెద్దాపురం అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టరు భవ్యశ్రీ అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వేడి పదార్థాలు తినాలని, కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎల్. కాంచన, కార్యదర్శి సి.సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలు జి.కాంతం, సహాయ కార్యదర్శి సీహెచ్ రత్నం, కోశాధికారి డి.నిర్మల జిల్లాలోని 20 మండలాల మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సామర్లకోట: ప్రస్తుత సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ఇంటింట సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన తన చాంబర్లో ఏఎన్ఎంల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వారిని ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించే విధంగా చూడాన్నారు. ఈ మేరకు 100 శాతం సర్వే పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ వేడి నీటిని తాగేలా చైతన్యం తీసుకు రావాలన్నారు. ప్రతీ రోజు సర్వే వివరాలను ఆన్లైన్లో పొందు పరచాలన్నారు.

నిల్వ చేపలు విక్రయిస్తే చర్యలు..

చేపల మార్కెట్లో నిల్వ చేపలు, చనిపాయిన చేపలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఏఎన్ఎంల సమావేశం అనంతరం మున్సిపాలిటీ పరిధిలో చేపల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ సమీప ప్రాంతాల్లో అతిసార కేసులు ఉన్న దృష్ట్యా చేపల విక్రయాలపై దృష్టి సారిస్తామని వివరించారు. డాక్టర్ భవ్య అతిసార వ్యాధి లక్షణాలు, వెంటనే తీసుకొవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమాలల్లో శానిటరీ ఇన్స్పెక్టరు పి. శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పిఠాపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి ఇందిర అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మండలంలోని విరవ ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అతిసార రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై టాం టాం వేయించారు. ఇళ్లలో నీటి నిల్వ లేకుండా, డ్రైన్లు పూడుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రాంబాబు, ఎంపీహెచ్ఎస్లు సత్యానందం, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు..



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న విద్యార్థుల ర్యాలీ

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కేశవరావు పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. ఉప్పాడ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మద్యపానం, గుట్కాలు అనారోగ్యానికి కారణమన్నారు. వీటి వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ బాంధవ్యాలు దెబ్బ తింటాయన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ గౌరవ అధ్యక్షుడు వి. సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

యువత మాదకద్రవ్యాల జోలికిపోవద్దు

పెద్దాపురం: యువత మాదకద్రవ్యాల జోలికి పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎక్సైజ్ ఎస్ఐ ఏవీవీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో స్థానిక సాగర్ జూనియర్ కళాశాల నుంచి పురవీధుల్లో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వాటి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటోందన్నారు. వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మాదక ద్రవ్యాలకు దూరంగా యువతను ఉంచాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాగర్ కళాశాల సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

30న హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: ఈ నెల 30వ తేదీ సాయంత్రం రెండు మున్సిపాలిటీల పరిధిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.ప్రభాకర్, జీవీకే మోహన్రావు, ఎ.శివయ్య, అల్లు ప్రసాద్, కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా శోభాయాత్ర నిర్వహించాల్సి ఉన్నదని, అప్పట్లో ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల వాయిదా వేశామన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్కు శోభాయాత్ర చేరుతుందన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న భక్తులు శోభాయాత్ర బైక్ ర్యాలీలో పాల్గొనాలని వారు పిలుపు నిచ్చారు.

మట్టి నమూనాలపై అవగాహన



విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలోని చల్లా వెంకట్రావు పద్మరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు (స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం) మట్టి నమూనాల అవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం హైస్కూల్ విద్యార్థులకు ఆత్మ పీడీ జ్యోతిర్మయి, పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకురాలు మాధవి ఆధ్వర్యంలో మట్టి నమూనా తీసే విధానం, విశ్లేషణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి భూసారాన్ని పరీక్షించడం వల్ల వ్యవసాయ అధికారులు భూమిలో లోపాలను సరిదిద్దేందుకు నేల సారం పెంచేందుకు అవసరమైన సూచనలిస్తారు. భూసారాన్ని అనుసరించే పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయి. నత్రజని, భాస్వరం, పొటాష్, ఖనిజ లవణాలు ఇతర పోషకాల విలువలు నేలలో ఎంత మేరకు ఉన్నాయో పరీక్షల ద్వారా తెలుస్తుందని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, పెద్దాపురం వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి, సుధామాధురి, మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలోని శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ బుధవారం తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారిచే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని చెప్పారు.